క్లుప్తంగా

మహిళలపై వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలి

ఖిలా వరంగల్: ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, కుటుంబ రంగాల్లో మహిళలు ఎదుర్కొనే దోపిడీ, పీడన, వివక్షకు వ్యతిరేకంగా అతివలు పోరాటం చేయాలని తెలంగాణ ప్రగతిశీల ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) అధికార ప్రతినిధి అజయ్‌బాబు పిలుపునిచ్చారు. ఖిలా వరంగల్ మండలం నక్కలపెల్లి గ్రామంలో ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జిల్లా కమిటీ బందెల చంద్రకళ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలను పడక గదికి, వంట గదికి పరిమితం చేస్తూ సొంత ఆస్తి, వస్తువులుగా పరిగణించే పురుషాధిక్యంపై మహిళలు సమష్టిగా పోరాటాలు చేయాలని సూచించారు. సమావేశంలో బాలరాజు, ఆరెల్లి కృష్ణ, ఎలకంటి రాజేందర్, మన్నె కోమల, అరుణ్ జ్యోతి, పద్మ, బన్న ఐలయ్య, యాకలక్ష్మి, జూరిక వరలక్ష్మి, ఎరుకల లక్ష్మి, బన్న నర్సింగం, ఎర్ర విజయబాబు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

హన్మకొండ అర్బన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని సాయిబాబా మందిర చైర్మన్ ముతుకుమల్లి హరగోపాల్ శర్మ అన్నారు. నగరంలోని బాలసముద్రం శ్రీదేవి ఏషియన్‌మాల్ సమీపంలోని షిరిడి సాయిబాబా మందిరంలోని ధాన్య మందిరంలో గురువారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముతుకుమల్లి హరగోపాల్ పాల్గొని మాట్లాడారు. మహిళలు దృఢ సంకల్పంతో రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో పోటీతత్వంతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. అయినా, నేటికీ సమాజంలోని కొన్ని చోట్ల మహిళలు అనేక అటుపోట్లు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు రాకం సదానందం, వేయిగండ్ల రమేష్, నిమ్మల శ్రీనివాస్, మందిర సిబ్బంది సాయికృష్ణ, రాజు, పద్మజ, సత్కార గ్రహీతలు డాక్టర్ పాడిశెట్టి వరలక్ష్మి, శుభోద, బి.రమాదేవి, సాగంటి మంజుల, విజయలక్ష్మి, డాక్టర్ రచ్చ కళ్యాణి, టి.వి సుజాతకుమారి, స్వప్న మాధురి, వాణీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సామాజిక న్యాయమేది?

హన్మకొండ: ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థుల ప్రకటనలో బీఆర్ఎస్ పాటించిన సామాజిక న్యాయమేదని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ప్రశ్నించారు. ముగ్గురు అగ్రకులాల అభ్యర్థులను ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 50శాతం పదవులు బడుగు, బలహీన వర్గాలకు ఇస్తామని పార్టీ రాజ్యాంగంలో రాసుకున్నామని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్.. గతంలో జరిగిన ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపుల్లో, అదేవిధంగా రాజ్యసభ పదవుల్లో, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అగ్రకులాలకే పెద్దపీట వేయడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగన్మోహన్ రెడ్డి.. 18 ఎమ్మెల్సీ ఎన్నికల భర్తీలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 14 పదవులు ఇచ్చి రాజకీయంగా అవకాశం కల్పిస్తే.. ఇక్కడ కేసీఆర్ మాత్రం అగ్రకులాల వారికి అగ్రతాంబూలం వేస్తున్నారని తెలిపారు. త్వరలో ప్రకటించే గవర్నర్ కోటాలోనైనా ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించాలని సూచించారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త ఆందోళనలు

వరంగల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మికవర్గ వ్యతిరేక ఫాసిస్టు విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధం కాబోతున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఆరెల్లి కృష్ణ, ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఎల్‌బీనగర్‌లోని జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మార్చి 15, 16 తేదీల్లో వరంగల్‌లో జరగనున్న విప్లవ కార్మిక సంఘాల ఐక్యవేదిక జాతీయ కమిటీ సమావేశాలలో ఉద్యమ కార్యాచరణకు రూపకల్పన చేయబోతున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి దేశంలోని 16 రాష్ట్రాల నుంచి నాయకులు హాజరవుతారని అన్నారు. ఏప్రిల్ 2, 3 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరుగుతాయని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగుల దయాకర్, నున్న అప్పారావులతో పాటు జిల్లా నాయకులు నర్సింహ, రాజేందర్, కుమార్, రవి, సాంబయ్య పాల్గొన్నారు.

ఆజంజాహిలో కలెక్టరేట్ నిర్మించాలి

ఖిలా వరంగల్: వరంగల్ ఆజంజాహి మిల్ మైదానంలో కలెక్టరేట్ సముదాయాన్ని నిర్మించాలని ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఎంసీపీఐ (యూ) ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దివంగత మద్దికాయల ఓంకార్ స్మారక భవనంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 12న నర్సంపేట పట్టణ కేంద్రం నుంచి హనుమకొండలోని వరంగల్ కలెక్టరేట్ వరకు పాదయాత్ర ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో గడ్డం నాగార్జున, జగదీశ్వర్, మహమ్మద్ ఇస్మాయిల్, నర్సయ్య, మాలి ప్రభాకర్, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులు, కార్మికులకు సన్మానం

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అతివలకు సత్కారం



హన్మకొండ: మహిళా పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్



కాళోజీ సెంటర్: డీఈఓ వాసంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యాలయ ఉద్యోగులు



హన్మకొండ చౌరస్తా: పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హన్మకొండ: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా హనుమకొండ బాలసముద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మహిళా పారిశుద్ధ్య కార్మికులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనిల్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధి పవన్, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ వాసంతికి సన్మానం

కాళోజీ సెంటర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వరంగల్ డీఈఓ కార్యాలయం ఉద్యోగులు, టీఎన్జీఓ సంఘం ప్రతినిధులు డీఈఓ వాసంతిని గురువారం సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగులు శ్రీనివాస్, సుభాష్, రాంగోపాల్, టీఎన్జీఓ సంఘం ప్రతినిధులు జగదీశ్వర్ ఉన్నారు.

49వ డివిజన్‌లో..

హన్మకొండ అర్బన్: 49వ డివిజన్‌లోని ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మున్సిపల్ మహిళా సిబ్బంది, మహిళా కార్యకర్తలను కార్పొరేటర్ ఏనుగుల మానస సన్మానించారు. కార్యక్రమంలో భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ సతీమణి దాస్యం శిరీష, నాయకురాలు మైమునద, రజిత, మాధవి పాల్గొన్నారు.

రైల్వే మహిళా కార్మికులకు..

కాజీపేట రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట జంక్షన్‌లో మహిళా కార్మికురాలను రైల్వే నాయకులు గురువారం సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు, రైల్వే ఇనిస్టిట్యూట్ కమిటీ నాయకులు, రైల్వే ఎస్సీ, ఎస్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

47వ డివిజన్‌లో..

కాజీపేట రూరల్: 47వ డివిజన్‌లోని పనిచేస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులను స్థానిక కార్పొరేటర్ సంకు నర్సింగరావు ఆధ్వర్యంలో కాజీపేట బాపూజీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు దువ్వ కనకరాజు, నార్లగిరి రమేష్, ఎండీ.సాజిద్, గబ్బెట శ్రీనివాస్, బొట్టు రాజు, మహేశ్వర్‌రావు, శ్రీకాంత్, పూర్ణిమ, విజయ, శానిటరీ జవాన్లు వెంకటయ్య, చంద్రమౌళి, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

61వ డివిజన్‌లో..

కాజీపేట: మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కాజీపేట 61వ డివిజన్ వడ్డెపల్లి ట్యాంక్ బండ్‌పై పారిశుద్ధ్య సిబ్బందిని కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి గురువారం సన్మానించారు. కార్పొరేటర్ ఎలకంటి రాములు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కుమ్మరి కోటిలింగం, పుల్లయ్య, బండ రాజేశ్వరి, రమాసీత, కోరబోయిన శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

6వ డివిజన్‌లో..

నయీంనగర్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 6వ డివిజన్ మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో డివిజన్‌లోని మహిళా పారిశుద్ధ్య కార్మికులను కార్పొరేటర్ చెన్నం మధు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు దామోదర్, శ్యామ్, మహేందర్, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

10వ డివిజన్‌లో..

హన్మకొండ చౌరస్తా: మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా హనుమకొండ మచిలీబజార్‌లోని 10వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను నాయకులు గురువారం సన్మానించారు. డివిజన్ మహిళా అధ్యక్షురాలు వైనాల హైమావతి, ప్రమీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ధర్మసాగర్ జెడ్పీటీసీ పిట్టల శ్రీలత, పార్టీ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, నాయకులు సారంగపాణి, ఖలీల్, తిప్పర్తి ఈశ్వర్, రాము, మొయినొద్దీన్, అనిల్, హరికృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.



హన్మకొండ అర్బన్: ఆశ వర్కర్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ ఏనుగుల మానస, తదితరులు



రైల్వే ఇనిస్టిట్యూట్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మహిళలు, ఇనిస్టిట్యూట్ కమిటీ సభ్యులు



కాజీపేట: పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానిస్తున్న మర్రి యాదవరెడ్డి



నయీంనగర్: పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న చెన్నం మధు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

హన్మకొండ: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కోర్టు జూనియర్ సివిల్ జడ్జి జి.శశి అన్నారు. హనుమకొండ గాంధీనగర్‌లో లయన్స్ క్లబ్ హనుమకొండ, కాకతీయ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం రాత్రి జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా జడ్జి శశి, 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి, కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం పీఆర్ఓ కిరణ్మయి, సమ్మయ్యనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.సౌజన్య, లయన్స్ క్లబ్ మహిళా విభాగం కో ఆర్డినేటర్ పి.త్రివేణి రెడ్డితో పాటు స్థానిక మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ 8వ రీజియన్ కార్యదర్శి చెరుకు వెంకట రాజిరెడ్డి, లయన్స్ క్లబ్, గాంధీనగర్ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా క్రైస్తవ మిషన్ ప్రెసిడెంట్‌గా ప్రశాంత్



హన్మకొండ: ఆల్ ఇండియా క్రైస్తవ మిషన్ సౌత్ ఇండియా ప్రెసిడెంట్, జాతీయ అధికార ప్రతినిధిగా హనుమకొండ ప్రశాంత్‌నగర్‌కు చెందిన అంబాల ప్రశాంత్ నియమితులయ్యారు. ఈమేరకు ఆల్ ఇండియా క్రైస్తవ మిషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎడ్విన్ సైమన్ ఒక ప్రకటనలో తెలిపారు.

బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్



హసన్‌పర్తి: బీఆర్ఎస్ రెండవ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా వంగపహాడ్‌కు చెందిన బొమ్మగాని వెంకటేష్ నియమితులయ్యారు. ఈమేరకు వెంకటేష్‌కు నియామక పత్రాన్ని ఎమ్మెల్యే అరూరి రమేష్ అందజేశారు.

25న విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

కేయూ క్యాంపస్: తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభను ఈనెల 25న కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించనున్నట్లు కేయూ జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌ఖన్నా తెలిపారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలోని గెస్ట్‌హౌస్‌లో సంఘర్షణ సభ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని అన్నారు. కేయూ జేఏసీ వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ వీరస్వామి, ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, బీసీ విద్యార్థి సంఘం, బీఎస్ఎఫ్, గిరిజన శక్తి కేయూ ఇన్‌చార్జ్‌లు నాగరాజు, శ్రీనివాస్, ఎండి.పాషా, ప్రశాంత్, సురేష్‌నాయక్, రమేష్, రాజేందర్ పాల్గొన్నారు.

నేడు ఎల్బీ కళాశాల వార్షికోత్సవం



రామన్నపేట: వరంగల్ ములుగు రోడ్డులోని లాల్ బహదూర్ (ఎల్‌బీ) కళాశాల 52వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు తెలిపారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేడుకలకు ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, సీపీ రంగనాథ్, టీఎన్జీవోస్ జనరల్ సెక్రటరీ ప్రతాప్ హాజరవుతారని తెలిపారు.

సైబర్ వేధింపులతోనే ఆత్మహత్యలు



సదస్సులో మాట్లాడుతున్న స్వాతి

విద్యారణ్యపురి: సైబర్ వేధింపులతోనే యువత ఆత్మహత్యకు పాల్పడుతోందని, కళాశాలల్లో ర్యాగింగ్ వ్యతిరేక కమిటీల ద్వారా ర్యాగింగ్‌ను నిరోధించవచ్చని షీటీం సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.స్వాతి తెలిపారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో మహిళా సాధికారత సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో సైబర్ నేరాలు, వేధింపులు, ర్యాగింగ్ వ్యతిరేక చట్టాలు అనే అంశాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా మహిళలు ఉన్నతావకాశాలను అందిపుచ్చుకోవచ్చని చెప్పారు. స్టాఫ్ క్లబ్ తరఫున 50మంది మహిళా ఉద్యోగులను సన్మానించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజీవయ్య, అధ్యాపకులు రమేష్, వెంకన్న, విజయ్‌పాల్‌రెడ్డి, నయినాదేవి, లీలావతి, సుధామాధురి, సునీత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు సేవా దృక్పథం అలవర్చుకోవాలి



అనాథ పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఖిలా వరంగల్: వైద్యులు సేవాదృక్పథాన్ని అలవర్చుకొని నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలను అందించాలని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ కేసీజీఎఫ్ డాక్టర్స్ వరంగల్ జోన్ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్, కేసీజీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సోమ శ్రీధర్, కార్యదర్శి డాక్టర్ వి.నరేష్‌కుమార్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ లక్ష్మీపురం రెండో గేట్ సమీపంలోని న్యూలైఫ్ సొసైటీ అనాథ పిల్లల ఆశ్రమంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ కేసీజీఎఫ్ డాక్టర్స్ వరంగల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 200 మంది అనాథ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కేసీజీఎఫ్ వైద్య బృందం చేతుల మీదుగా న్యూలైఫ్ ఆశ్రమ చైర్మన్ రజిని, కార్యదర్శి పూర్ణచందర్‌కు రూ.18 వేల విలువైన వాషింగ్ మిషన్, రూ.3 వేల విలువగల నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు.

సంక్షిప్తంగా

బూత్ స్థాయి నుంచి పటిష్ట పర్చాలి

మామునూరు: భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి పటిష్టపర్చాలని పార్టీ ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు ఉదయ్ ప్రతాప్, జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పిలుపునిచ్చారు. ఖిలా వరంగల్ మండలం హంటర్‌రోడ్డులోని గణపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి అధ్యక్షతన పార్టీ సమావేశం గురువారం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ మండలం, డివిజన్ల వారీగా కోఆర్డినేటర్లను నియమించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, రాష్ట్ర ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బన్న ప్రభాకర్, జలగం రంజిత్, 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, తాళ్లపెల్లి కుమారస్వామి, పిట్టల కిరణ్, ఆడెపు వెంకటేష్, నాంద్రే అమర్‌నాథ్ పాల్గొన్నారు.

'రాయల చంద్రబోస్' ఆశయాలు స్ఫూర్తి

ఖిలా వరంగల్: విప్లవోద్యమ స్ఫూర్తి ప్రదాత, సీపీఐ (ఎంఎల్) ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) జిల్లా కమిటీ సభ్యులు రాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహరావు సూచించారు. ఖిలా వరంగల్ పడమరకోటలోని అమరవీరుల స్తూపం వద్ద సీపీఐ (ఎంఎల్), పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాయల సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ లక్షలాది ఎకరాల పోడు భూములను దళిత, గిరిజన, ఆదివాసీ, అట్టడుగు ప్రజలకు చంద్రబోస్ పంచాడని గుర్తుచేశారు. కార్యక్రమంలో మైదం పాణి, మోహన్, అమరేందర్, కళ్యాణ్, నరసింహ, సల్మాన్, భిక్షపతి, కుమార్, రవి పాల్గొన్నారు.

పెరిక సంఘం గౌరవ అధ్యక్షుడికి సన్మానం



ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం పెరకవాడకు చెందిన ఉద్యమకారుడు, జేఏసీ కన్వీనర్, సామాజికవేత్త దిడ్డి నరేందర్.. గ్రేటర్ వరంగల్ పెరిక సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు ఆయనను 34వ డివిజన్ శివనగర్‌కు చెందిన యూత్ ప్రతినిధులు గురువారం సన్మానించారు. కార్యక్రమంలో పెరిక యూత్ ప్రతినిధి ఇట్టబోయిన గణేష్, ప్రతినిధులు హర్షిత్, చంద్, మనీష్, ప్రణీత్, వశిష్ట, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో ఉచిత వైద్య సేవలు

దేశాయిపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకంలో సభ్యత్వం తీసుకుని ఉచితంగా వైద్య సేవలు పొందాలని బీజేపీ తూర్పు ఇన్‌చార్జ్ కుసుమ సతీష్ సూచించారు. 13వ డివిజన్‌లో ఆయుష్మాన్ భారత్ ఉచిత నమోదు కేంద్రాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఈ పథకంలో రూ.5లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, కోట సతీష్, అపురూప రజనీష్‌నేత, తుమ్మ రమేష్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

మహంకాళిని దర్శించుకున్న మేయర్

ఖిలా వరంగల్: మహంకాళి తల్లి ఉత్సవాల నేపథ్యంలో రంగశాయిపేటలోని మహంకాళి దేవాయంలో అమ్మవారిని నగర మేయర్ గుండు సుధారాణి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆమె కానుకలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

మల్లయ్య మృతి గంగపుత్రులకు తీరని లోటు

కాజీపేట: గంగపుత్రుల (బెస్త) సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం కోసం పనిచేసిన మల్లయ్య అకాల మృతి సంఘానికి తీరని లోటని జిల్లా అధ్యక్షుడు పాక ఓంప్రకాష్ అన్నారు. కాజీపేట పట్టణంలోని సంఘం ప్రధాన కార్యాలయంలో మల్లయ్య చిత్రపటానికి సభ్యులు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాక వేదప్రకాష్, కొమురయ్య, పొక్కుల సదానందం, లింగం తదితరులు పాల్గొన్నారు.

భూమి విక్రయించారు.. తిరగబడుతున్నారు..

హసన్‌పర్తి: భూమి విక్రయించి.. ఇంకా ఆ భూమిపై హక్కు ఉందని అమ్మకందారులు తిరగబడ్డారు. ఈమేరకు బాధితులు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ రావుల నరేందర్ తెలిపారు. హసన్‌పర్తి రెవెన్యూ శివారులో సర్వే నంబర్ 137/బిలో సుమారు 2.16 ఎకరాల భూమిని పట్టాదారులు 2007లో విక్రయించారు. సదరు కొనుగోలుదారులు ఆ భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించారు. ఆ భూమిలోని పట్టాదారుడి కుమారుడు పోతరాజు ప్రభాకర్ ప్రస్తుతం తిరగబడ్డాడు. జేసీబీతో ఏకంగా కందకాలు తీయించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోతరాజు ప్రభాకర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ నరేందర్ పేర్కొన్నారు.

ప్రయోగాలతో సైన్స్ బోధించాలి



సైన్స్ కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ గోపి

వరంగల్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రయోగాలతో సైన్స్ బోధిస్తే ఆసక్తితోపాటు అవగాహన పెరుగుతుందని కలెక్టర్ డాక్టర్ బి.గోపి అన్నారు. జిల్లాలోని 13 మండలాల్లో గల 38 ప్రభుత్వ పాఠశాలలకు సైన్స్ కిట్లను సూర్యకిరణ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు తూడి విద్యాసాగర్ సహకారంతో కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం కలెక్టర్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ పరికరాల కిట్లను ప్రభుత్వ పాఠశాలలను అందజేయడం మంచి పరిణామమన్నారు. డీఈఓ డి.వాసంతి మాట్లాడుతూ సైన్స్ ఉపాధ్యాయులు కిట్లను పూర్తిస్థాయిలో ఉపయోగించాలన్నారు. కాగా.. ఒక్కో పాఠశాలకు రూ.3వేల విలువైన కిట్లను పంపిణీ చేశారు. అదనపు కలెక్టర్ శ్రీవత్స, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుతో పాటు విద్యుత్ స్తంభాల ఆక్రమణ

- చోద్యం చూస్తున్న అధికారులు



రోడ్డు, స్తంభాలను ఆక్రమిస్తూ నిర్మించిన ప్రహరీ

హన్మకొండ: నగరంలోని అంబేడ్కర్ కూడలి - ఎన్జీవోస్ కాలనీ ప్రధాన రోడ్డును ఆక్రమిస్తూ ప్రహరీ నిర్మాణం చేపట్టినా.. వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులు అభ్యంతరం చెప్పకపోవడం, నిర్మాణాన్ని అడ్డుకోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. హనుమకొండ రాంనగర్‌లోని ఆర్టీసీ హనుమకొండ డిపో ఎదుట శిథిలావస్థకు చేరుకున్న ఆర్టీసీ ఉద్యోగుల నివాస గృహాల సముదాయ స్థలాన్ని ఆర్టీసీ యాజమాన్యం లీజ్‌కు ఇచ్చింది. లీజ్‌కు తీసుకున్న సదరు వ్యక్తి శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్‌ను కూల్చి చదును చేసి స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాడు. రోడ్డును ఆక్రమిస్తూ ప్రహరీ నిర్మాణాన్ని రాత్రికి రాత్రికే పూర్తి చేశాడు. రోడ్డుతో పాటు రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను కూడా లీజ్‌కు తీసుకున్న స్థలంలో కలిపేసుకుని ప్రహరీ నిర్మించారు. ఇదంతా వారం రోజులుగా జరుగుతున్నా ఇటు వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులు గానీ, అటు టీఎస్ ఎన్పీడీసీఎల్ అధికారులు గానీ పట్టించుకున్న పాపానా పోలేదు. ఈ అక్రమ నిర్మాణం జరుగుతున్న తీరుపై ఈనెల 2న సాక్షి దినపత్రిక ఓ కథనాన్ని ప్రచురించింది. అయినా అధికారుల్లో చలనం రాలేదు. విద్యుత్ 11 కేవీ లైన్‌కు నాలుగు మీటర్ల దూరం వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దనే నిబంధనలు ఉన్నా ఇవేమీ పట్టని లీజుదారుడు ఏకంగా విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్‌ను ఆక్రమిస్తూ విద్యుత్ లైన్ కిందనే ప్రహరీ నిర్మించాడు. విద్యుత్ సంబంధ సందేహాలను తీర్చాల్సిన ఓ చీఫ్ ఇంజనీర్ స్థాయి అధికారి.. లీజుదారుడికి ఉచిత సలహాలు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆర్టీసీ స్థలం చుట్టూ రోడ్డును ఆక్రమిస్తూ చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.

కుటుంబ సభ్యులకు మహిళ అప్పగింత



సరితను కుటుంబ సభ్యులకు అప్పగించిన సిబ్బంది

వరంగల్: మానసిక స్థితి సరిగాలేని మహిళను ఆమె కుటుంబ సభ్యులకు తిరిగి అప్పగించినట్లు వరంగల్ సఖి సెంటర్ కౌన్సెలర్ రమాదేవి తెలిపారు. చిన్నబోయిన సరిత అనే మహిళ తన సొంత ఊరుకు వెళ్లేందుకు హనుమకొండలోని డబ్బాల ప్రాంతంలోని అమ్మమ్మ ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా బయలుదేరింది. మానసికంగా ఎదుగుదల లేనందునా అడ్రస్ తెలియక ఏనుమాముల మార్కెట్ పరిధిలో తిరుగుతుండగా పోలీసులు ఆమెను గుర్తుంచి మైనర్‌గా భావించి చైల్డ్‌లైన్ వారికి సమాచారం ఇచ్చి వరంగల్ సఖి సెంటర్‌లో బుధవారం అప్పగించారు. సఖి సెంటర్‌లో వసతి కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించగా తాను డబ్బాల ప్రాంతంలోని అమ్మమ్మ ఇంట్లో ఉన్నట్లు తెలపడంతో వివరాల ఆధారంగా మహబూబాబాద్ జిల్లా సఖి సెంటర్ అడ్మిన్‌తో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆమెను అప్పగించారు.